# బ్రహ్మాండమైన కథ

అందమైన కథ, కదిలించే కథ, జరిగిన కథ మొదలైనవి ఇదివరలో కథా సాహిత్యంలో వెలువడ్డాయి. ఇది బ్రహ్మాండమైన కథ. చదివిన వారందరినీ బ్రహ్మాండంగా మెప్పించి బ్రహ్మానంద భరితుల్ని చెయ్యాలని నా కోరిక. కాని అందరినీ మెప్పించడం బ్రహ్మతరం కూడా కాదు. అంచేత....

ఉపోద్ఘాతం చాలించి, అసలు కథకి ఉపక్రమిద్దాం! బ్రహ్మ దేవుడికీ కవులకీ వృత్తివైరం లాంటిదేదో వుండి వుంటుంది. అందుకనే వాళ్ళు 'వీలు' దొరికినప్పుడల్లా బ్రహ్మ మీద విరుచుకుపడి, విమర్శలు విసిరేశారు.

'బ్రహ్మకైనను పుట్టు రిమ్మ తెగులు' అన్నాడొక కవి.,

'ముదిమి మది దప్పిన మొదటి వేల్పు'గా పేర్కొన్నాడు పెద్దన., "ఓరి బ్రహ్మదేవుడా! నీ బుద్ధి యింత బుగ్గయి (బుగ్గ కాదు. బుగ్గి అయి) పోయినదేమిరా?" — అని బాహాటంగా నిలదీశాడు మరో మహాకవి!

నిప్పు లేనిదే పొగరాదు గదా! బ్రహ్మపై వచ్చిన ఆరోపణలలోని నిజా నిజాలు విచారించవలసిందిగా కమిటీని నియమించగా, వారు సమర్పించిన నివేదిక మేరకు వెల్లడింపబడిన, బ్రహ్మ గావించిన — నేరాలేవనగా.,

1. దివ్యస్థలంబగు తిరుపతి కొండను కోతి మూకకు పాదుగొలుపుట!
2. హంస తూలికా తల్పంబులందున చెడు నల్లులను సృష్టి జేయుట.
3. ప్రీతి నింపెడు గులాబీ చెట్ల నాడే నింపెడు ముళ్ళు సృజించుట.
4. సౌఖ్యముల కాకరమైన చింతామణి ఇంట శ్రీహరిని సృష్టి చేయుట.


నివేదికలోని పై అంశాలు సత్యదూరాలు కావు. కాబట్టే, శాశ్వత బ్రహ్మకల్పంగా నిలిచి వున్నాయి. వీటిని కాదనడం బ్రహ్మవశం కాదు. బ్రహ్మ తరం కానివి చాలా వున్నాయి.

అతని కెంత కోపం వచ్చినా హంసకు, "వనజ వనీవిహార కలనము దొలగంగ జేయు గాని, గుంభమున దుగ్ధ జీవన విభాగ విధాన నిరూఢి వైపుధ జనిత మహాయశో విభవ సారము" మాన్పలేడు. ఇది కవి చమత్కృతి. తనకు చేత కాదని తనంత తాను అంగీకరించిన విషయం మరొకటుంది. "నా చేతను గాని పని — స్త్రీల నోరు మూయుటమ్మా!"

కేనీ చాత కాదని నిందింపడం అనుచితం! అన్యాయము! అక్రమం! అధర్మం!

త్రిమూర్తులలో విష్ణువు శ్రీ, భూ, నీళలకు భర్త. మహేశ్వరుడు గౌరీపతి, గంగాధరుడు. బ్రహ్మ ఏకపత్నీ వ్రతుడు. బ్రహ్మ లిపి యెవరికి బోధపడదు — కాబట్టే యెవరి చేత మార్చబడదు. అందుకనే "మదుటన్ వ్రాసిన వ్రాత మార్ప గలమే మారేండ్లు చింతించినన్" అన్న సూక్తి ఉద్భవించింది. అంతేకాదు, అతడు "వెన్నానట వ్రాసిన సొమ్ము మరుభూమి కేగినన్ లభించు; మేరువు చేరబోయినన్ ధనమధికంబు రాదు."

కవుల కావ్యాలలో 'అది లేదు' 'ఇది లేదు' అని రంధ్రాన్వేషకులైన విమర్శకులు తెగనా



వేట్నా., బ్రహ్మ లిపిలో తప్పు లెన్నడం అతని కొడుకు నారదుని కలవాటు. కళ్లలో ఒత్తులు వేసుకుని వెతగ్గా సముద్ర తీరాన అతనికో కపాలం కనిపించింది. శ్రద్ధాశక్తులతో దోషగవేషణ గావించగా; బ్రహ్మ కపాలం మీద ( హరి ద్వారం బ్రహ్మ కపాలం కాదు.) కపాలం మీద బ్రహ్మ! వ్రాసిన పంక్తులలో

"......... సముద్ర తీరే మరణం

కించిత్ భోగం భవిష్యతి" — అని కనిపించింది. వివాదగ్రస్తమైన కావ్యపు కవి కర్తృత్వం గురించి గ్రంథస్థ మయిన ఆధారం దొరికినంత బ్రహ్మానందం కలిగింది బ్రహ్మ నందనునకు! "చచ్చిన తర్వాత భోగ మేమిటి? అనుభవమేమిటి? విడ్డూరం! వయస్సు మళ్ళింది. బుద్ధి సన్న గిల్లింది. తన పదవికి వారసుణ్ణి ఎన్నుకొని, తర్ఫీదిచ్చి, శిక్షణానంతరం పదవికి రాజీనామా ఇచ్చి, ఆ పదవి శిక్షితుడికి ఇచ్చి, యే వేసవి విడిదిలోనో శేష జీవితం గడప కూడదా?" అని తనలో తాను తీర్మానించుకుని, ఆ తీర్మానంతోపాటు సముద్ర తీరాన దొరికిన కపాలము గొని, సత్యలోకము జని, తా గన్న విడ్డూరం తండ్రికి విన్నవించగా —

నారదుని ఏకగ్రీవ ( తక్కిన వారి గ్రీవాలు వినిపించక పోవడం రాజకీయ ధర్మం ) ఏకైక గ్రీవ తీర్మానం విని బ్రహ్మ వెల్లడించిన వైనమిది:

"నిరంతర నారాయణ స్మరణ పరాయణుడవు! బ్రహ్మానంద మానసబ్రహ్మచారివి! త్రిలోక(సం)చారివి! త్రికాల వేదివి! స్వహస్తాలతో ఆ కపాలం, మర్త్యలోకం నుంచి సత్య లోకానికి తీసుకు రావడమే ఆ "కించిత్ భోగం" అన్నాడు బ్రహ్మ. పదవికి రాజీనామా ఇవ్వాలన్న తీర్మానం వోటింగ్ వరకూ రాకుండానే 'వోడి పోవాయింది' .......

అదీ బ్రహ్మ లిపి. బ్రహ్మాస్త్రం అలాటిదే! ఆ అస్త్రం ప్రయోగించాక, మరే అస్త్రమూ దాని మీద పని చెయ్యదు. బ్రహ్మముడి అలాటిదే! బ్రహ్మవిద్య కష్టసాధ్యమైనది. మసాధ్యమైన వాటిని గురించి వ్యంగ్యంగా చెప్పాలంటే "ఓ అదేం బ్రహ్మవిద్య గనకనా? ఇట్టే సాధిస్తా" అనడం పరిపాటి. ఏ పనైనా సాధించడానికి విపరీతంగా పరిశ్రమించి, అపరిమితంగా అల్లకల్లోలము లేవదీస్తే 'బ్రహ్మ ప్రళయ మయింది' అని సగర్వంగా చాటి చెబుతారు.

మహా నదులతో విలసిల్లే భారత దేశానికి తరచు ప్రళయాలు ఉపద్రవాలు సంభవిస్తుంటాయి. వాటిలో ఒకటి, ఉత్తరప్రదేశ్‌లోని బ్రహ్మపుత్రానది వరదల భీభత్సం.

వరదలకి సైతం వెరువని చలింపని నిశ్చల సమాధి స్థితి చతుర్ముఖ పురాణం పారాయణ చేసే వాళ్ళకి సిద్ధించింది. చతుర్ముఖాలంటే ఋగ్, యజుర్, సామ, అథర్వణాలనుకునేరు! ఆటీన్, డైమన్, ఇస్పేట్, కళావర్ అన్నవి చతుర్ముఖాలు. (రాజకీయ జూదంలో చతుర్ముఖాలు.) 1. పలుకుబడి. 2. ఎన్నికలో విజయం. 3. పదవి. 4. సంపద.

జీవితంలో పండుగ రోజుల్లో చతుర్ముఖ పురాణం అధ్యయనం చేస్తారు కొందరు. ఆ 'పండుగ' తోనే జీవితమంతా గడుపుతారు మరి కొందరు. ఇవన్నీ బ్రహ్మ సృష్టిలోని విచిత్రాలు. అతని సృష్టివైచిత్రి గురించి చిన్నప్పుడొక చిన్న పాఠం చదువుకున్నాను.

దారినపోయే దాసయ్య ఒకడు ఎండగా వుందని చెట్టు నీడకి చేరుకున్నాడు. తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టినట్టు కొమ్మలు, ఊడలు, ఆకులు, కాయలూ చూడ్డం మొదలెట్టేడు. చూడగా చూడగా, అతనికో బ్రహ్మ జిజ్ఞాస కలిగింది. "ఇంత పెద్ద చెట్టుకి ఇంత చిన్న కాయలేమిటి? బ్రహ్మకి బుర్రలే" దనుకున్నాడు. ( నిజమే! బ్రహ్మకి ఒక బుర్రలేదు!! ) ఎండ తగ్గలేదు. కాళ్ళు పీకెడుతున్నయి. పడుకుంటే బాగుంటుం దనుకున్నాడు. అటూ ఇటూ చూశాడు. గుమ్మడి కాయలతో వున్న తీగ పాద కనిపించింది. కాయలున్నాయి! 'బ్రహ్మకి నిజంగానే బు లేదు" అని దృఢ పరుచుకున్నాడు. పరుచుకు పడుకున్నాడు. లేచే సరికి తన చుట్టూ గా పడి వున్న మర్రిపళ్ళు ( తన మీద కూడా కొ పడ్డాయి! ) చూశాడు.

బ్రహ్మని నిందించిన తన తెలివి తక్కువతనా సిగ్గు పడ్డాడు. బాటసారులు విశ్రమించే పె చెట్టుకి పెద్ద కాయలు ఎందుకు బ్రహ్మ సృష్టి లేదో అర్థమైంది.

విచిత్రమైన బ్రహ్మసృష్టి ఆదర్శప్రాయమైన బ్రహ్మకి పితామహుడని పేరు. ఏ మ త్మడైన ఒక కొత్త విషయం కనిపెట్టి, రంగంలో మార్గదర్శకుడైతే అతనిని పితామ నిగా సంభావిస్తారు. సమ్మానిస్తారు.

అల్లసాని పెద్దన ఆంధ్ర కవితా పితామహు



'లతిక'

తిక్కన కవి బ్రహ్మ. ఆదిభట్ల నారాయణదాసు గారు హరికథా పితామహులు !


పెద్దన వాడు ప్రాదుర్భవించిన ప్రబంధం పింగళి సూరన నాటికి ఉచ్ఛదశ అందుకుంది. అతని కళా పూర్ణోదయ మంతటికీ మూలం వాణి చతుర్ముఖుల ప్రణయ ప్రసంగమే. ఆ కావ్యంలోవి పాత్రలన్నీ వారి చేతల ప్రతి రూపాలే.


సరస్వతి అననేందు బింబమే కళాపూర్ణుడు.

# బ్రహ్మాండమైన కథ

ఆమె నవ్వు అభినవ కౌముది. రూపానుభూతి, మదాశయుడు, ధీర భావుడు, మొదలైన పాత్ర లన్నీ బ్రహ్మ అనుభూతులు.

తొలి జన్మలో సరస్వతీదేవి పెంపుడు చిలుక, మరుసటి జన్మలో కలభాషిణి. మూడవ జన్మలో




మధురలాలస ! ఈ మూడు జన్మల కళాపూర్ణోదయ బృహత్కథ — అర్థం కాని వాళ్ళకి, చేసుకునే ఓపిక లేని వారికే బ్రహ్మజెముడు ముళ్ళడొంకలా వుంటుంది. అర్థమైతే 'ఆనందో బ్రహ్మ' అన్న వేదోక్తిలోని నిజం అనుభవానికి వస్తుంది.

అనుభవాలు యెవరివైనా, వాటివల్ల గుణ పాఠాలు అందరూ నేర్చుకోవచ్చు. 'ప్రమత్తులై నిద్రపోతే సొత్తు దొంగలు కాజేస్తారు' అన్నది మొదట బ్రహ్మకే అనుభవమైంది. "ప్రళయాంభోనిధి లోన మేన్మరచి నిద్రం జెందు వాణీశు మోమున వేదంబులు" సోమకాసురుడు అపహరించాడు.

యోగ నిద్ర కానివ్వండి ! మొద్దు నిద్ర కానివ్వండి ! మేను మరచి నిద్రపోతే ఇలాటి ఇబ్బందులు తప్పవు. సోమకాసురుడు వేదాలు అపహరిస్తే, రావణాసురుడు వేదవతీ అవతారమైన సీతను అపహరించాడు. ఆమె కోసం రాముడు రావణుని ప్రాణాలు హరించాడు. రాముడికి బ్రహ్మహత్యా పాతకం బ్రహ్మరాక్షసిలా చుట్టుకుంది. ఆ పాప పరిహారానికి రాముడి శివలింగ ప్రతిష్ఠ గావించాడు. రామునిచే ప్రతిష్ఠింపబడిన శివలింగమే రామలింగం. ఆ తీర్థమే రామేశ్వరం. నాటి సంఘటనకి చిహ్నంగా రాముని పేర రామేశ్వరం వున్నట్లే బ్రహ్మ పేరిట కూడా ఒక ఊరు ఉంది. అది బ్రహ్మపురం. సంయుక్తాక్షరాలు పలుకలేని పాశ్చాత్యులు బెర్‌హెంపూర్ అన్నారు. క్రమంగా అది ఈనాటికి బరంపురం అయింది.

" మనం మనం బరంపురం " అంటారు పిల్లలు. బాల వాక్యం అంటారు పెద్దలు. బాలలకి బ్రహ్మదేవునితో సమానమైన ప్రతిపత్తి లభించడానికి కారణం తెలుసా ? !

" తొలత బ్రహ్మాండమ్ము
తొట్టె గావించి
నాలుగు వేదముల్.
గొలుసు లమరించి
జో అచ్యుతా నంద
జో జో ముకుందా !
లాలి పరమానంద
రామ ! గోవిందా !"

— అని దేశి కవితలో, ద్విపద ఛందస్సులో తల్లులు జోల పాటలు పాడడమే ఆ కారణమేమో ! బాలుడు జోల విని నవ్వుళిస్తే పడతికి బ్రహ్మానందం కలుగుతుంది. బ్రహ్మానంద మన్నపదానికి, ఆంధ్ర కవితా పితామహుని నిర్వచనమిది. ( వచనం కానిది — నిర్వచనం — పద్యం !! )

'ఎందే డెందము కదళించు రహిచే
నేకాగ్రతన్ నిర్వృతిన్
జెందున్ గుంభగత దీపకళికా
శ్రీ దోప నెందెందు బో
కెందే నింద్రియముల్ సుఖంబుగను నా
యింపే పరబ్రహ్మ ' మా
నందో బ్రహ్మ ' యటన్న ప్రాజదువు
నంతర్బుద్ధి నూహింపుమా !'

ఇంత బ్రహ్మాండంగా కవిత చెప్పాడు గనకనే సారస్వత పోషకుడు, ఆంధ్రభోజుడు అయిన రాయలు పెద్దనకి బ్రహ్మరథం పట్టేడు. మను చరిత్ర వ్రాసిన ఘనత పెద్దనది. ఆదరించిన ఘనత ఆంధ్ర విద్వజ్జనతది.

బ్రహ్మార్పణం! ★